సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నిస్వార్థ సేవలకు గుర్తింపు



గుడే సుశీలా గజేంద్రరావును సత్కరిస్తున్న అగనంపూడి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: నిస్వార్థ సేవలకు గుర్తింపు లభించిందని లయన్స్‌క్లబ్ పూర్వ జోనల్ చైర్మన్ కిడిమి హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ 85వ వార్డు అధ్యక్షుడు పూర్ణానంద శర్మ (పూర్ణ) అన్నారు. సామాజిక సేవా రంగంలో విశేష సేవలు అందిస్తున్న గుడే సుశీలా గజేంద్రరావుకు కేంబ్రిడ్జ్ డిజిటల్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ సందర్భంగా అగనంపూడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సుశీలా గజేంద్రరావు దంపతులను ఘనంగా సత్కరిచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దశాబ్దంన్నర కాలంగా నిరుపేదలకు అండగా నిలుస్తూ వందల కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారని, అలాంటి వారి సేవలకు గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలోలయన్స్‌క్లబ్ ప్రతినిధులు బొండా ఈశ్వరరావు, బత్తుల కాళిదాస్, అంగులూరి ఈశ్వరరావు, డాక్టర్ వేచలపు వేంకటరామారావు, యార్లగడ్డ నాగేశ్వర ప్రసాద్, ఐలా రామ్‌గోపాల్, కరణం జోగినాయుడు లంకెలపాలెం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిజిస్టర్డ్ పోస్ట్‌ను కొనసాగించాలి

అగనంపూడి: భారతీయ తపాలా శాఖలోని కీలకమైన రిజిస్టర్డ్ పోస్ట్‌ను వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయమని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు ఆరోపించారు. అగనంపూడిలోనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1854 నుంచి కొనసాగుతున్న రిజిస్టర్డ్ పోస్ట్‌ను ఎత్తివేసి 1986 నుంచి అమల్లోకి వచ్చిన స్పీడ్ పోస్ట్‌ను కొనసాగించడం దారుణమన్నారు. పేద, మధ్య తరగతుల నుంచి వివిధ రూపాల్లో దోపిడీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రిజిస్టర్డ్ పోస్ట్‌ను ఎత్తివేసి స్పీడ్ పోస్ట్‌కు అలవాటు చేసి ఎక్కువ సొమ్ము వసూలు చేయడానికి సిద్ధమైందన్నారు.అధికారికంగా సమాచారం బదిలీ చేయడానికి కీలకంగా ఉన్న రిజిస్టర్డ్ పోస్టును కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిమ్మకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీ నిధులపై ఆడిట్ జరిపించాలని వినతి

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) నిధులపై ఆడిట్ జరిపించాలని స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ అధికారులు కోరారు. ఈ మేరకు వారు శనివారం స్టీల్‌ప్లాంట్ సీఎండీకి లేఖ అందజేశారు. సీ బైలాస్ ప్రకారం సహజ, అసహజ మరణానికి రూ. 5 లక్షలు అందించాలని, పదవీ విరమణ చేసిన వారికి రూ. 20 వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. తొలగించిన, రాజీనామా చేసిన వారికి మాత్రమే ఈ సాయం వర్తించదని ఉన్నా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారికి కూడా వర్తించదని అసోసియేషన్ తప్పుదోవ పట్టిస్తుందని పేర్కొన్నారు. జీవితాంతం సేవ చేసి పదవీ విరమణ చేసిన తమకు బెనివలెంట్ ఫండ్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యం స్పందించి నిధులపై ఆడిట్ జరిపించాలని కోరారు. దీనిపై సీ ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ బైలాస్ ప్రకారం వీఆర్ఎస్ ఉద్యోగులకు బెనివలెంట్ ఫండ్ ఉండదన్నారు. వారికి ఆ ఫండ్ చెల్లించాలంటే ప్రస్తుతం ఉన్న ప్రతీ సభ్యుడి నుంచి రూ. 3000 వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై భవిష్యత్తులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ కథ కంచికి!



రోడ్డుపై రైల్వేస్టేషన్ గోడను ఆనుకొని నిలిపిన ఆటోలు



ఆటో డ్రైవర్లతో చర్చిస్తున్న సీఐ వెంకటరావు (ఫైల్)



ఖాళీగా ఉన్న ఆటో స్టాండ్

- చార్జీలపై ఎడతెగని పంచాయితీ
- రెట్టింపు డిమాండ్ చేస్తున్న ఆటోవాలాలు
- కుదరని సయోధ్య..
- ప్రీ పెయిడ్ స్టాండ్‌లో ఆటోలు నిలిపేందుకు నిరాకరణ
- ప్రస్తుత ధరలు గిట్టుబాటు కావని అసోసియేషన్ వాదన

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ కథ కంచికి చేరుతోంది. తాము డిమాండ్ చేసిన ధరలు చెల్లిస్తే తప్పా స్టాండ్‌లో ఆటోలు నిలిపేది లేదని ఆటో యూనియన్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దువ్వాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిల్లి వెంకటరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ పలుమార్లు ఆటోవాలాలతో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ప్రస్తుత చార్జీలు తమకు గిట్టుబాటు కావని.. భారీగా పెంచితేనే స్టాండ్‌లో ఆటోలు నిలుపుతామని తెగేసి చెప్పేశారు.

ఇదీ పరిస్థితి

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రాకపోకలు సాగించేవారికి ఆటో చార్జీలు భారంగా ఉన్నాయని ప్రజా సంఘాలు వినతులు అందించడంతో పోలీసులు, రైల్వే అధికారులు స్పందించి ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేశారు. అప్పట్లో సుమారు 70 వరకు ఆటోలు ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్‌కు అంగీకారం తెలిపారు. రెండున్నర మాసాల కిందట ఈ స్టాండ్‌ను నగర పోలీస్ కమిషనర్, డీఆర్ఎం అట్టహాసంగా ప్రారంభించారు. రైల్వేస్టేషన్ నుంచి కూర్మన్నపాలెం రెండు కిలోమీటర్లన్నరకు రూ.40గా నిర్ణయించారు. అదే ఓలా, ఊబర్, రాపిడో ప్రైవేటు టాక్సీ సర్వీస్‌లు రూ.92 వసూలు చేస్తున్నారు. కానీ ఆటోస్టాండ్ యూనియన్ మాత్రం రూ.150 చెల్లిస్తే తప్పా గిట్టుబాటు కాదని తెగేసి చెబుతున్నారు. గాజువాకకు పోలీస్‌లు రూ.80 వసూలు చేయాలని నిర్ణయించగా ప్రైవేటు ఆన్‌లైన్ ట్యాక్సీ సర్వీస్‌లు మాత్రం రూ.130 తీసుకుంటున్నారు. అదే దువ్వాడ ఆటో స్టాండ్ వాలా మాత్రం రూ.200 చెల్లించాల్సిందేనంటున్నారు. ఎస్ఏడీ కొత్త రోడ్డుకు పోలీస్‌లు రూ.180 ఖరారు చేయగా ఆటోస్టాండ్ వారు మాత్రం రూ.300 చెల్లించాల్సిందేనంటున్నారు. ఇదే విషయమై పోలీస్ అధికారులకు లేఖ అందజేశారు. దీంతో సీఐ పలుమార్లు ఆటోస్టాండ్ యూనియన్ నాయకులతో చర్చించినప్పటికీ వారు తగ్గలేదు. ఏకంగా ప్రీ పెయిడ్ స్టాండ్‌లో ఆటోలు నిలపడం మానేశారు.

ప్రయాణికులకు ఇబ్బంది



పోలీస్ అధికారుల నిర్ణయించిన ధరల వల్ల డ్రైవర్లు నష్టపోతున్నామని భావిస్తే అధికారులతో మాట్లాడాలి తప్పా ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం సరికాదు. ఆటో డ్రైవర్లు ఇరు పక్షాలకు ఇబ్బంది లేనివిధంగా అధికారులకు విన్నవించుకోవాలి. డిమాండ్ చేసిన చార్జీలు చెల్లించకపోతే ఆటోలు స్టాండ్‌లో నిలపబోమని బహిరంగంగా చెప్పడం తగదు. ఈవిషయంలో పోలీస్, రవాణా, రైల్వే అధికారులు చొరవ తీసుకోవాలి. - కె.విజయ్‌కుమార్, ఎస్టీబీఎల్

ఆటో డ్రైవర్లను నియంత్రించాలి



అధికారులు నిర్ణయించిన చార్జీల వల్ల గిట్టుబాటు కాదని ఆటోలు స్టాండ్‌లో నిలపకుండా రైల్వేస్టేషన్ గోడను ఆనుకొని నిలపడాన్ని నియంత్రించాలి. నిర్ణీత చార్జీలు మాత్రమే వసూలు చేసేలా శాంతిభద్రతల పోలీస్‌లు, రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఉమ్మడిగా ఆటో యూనియన్‌తో చర్చించి సమస్యను కొలిక్కి తీసుకురావాలి.

– ఎం.సుందరమూర్తి, రాజీవ్‌నగర్

ప్రయాణికులకు మేలు చేయడం కోసమే

కొంతమంది ఆటో డ్రైవర్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని పలుమార్లు ఫిర్యాదు చేయడంతో నగర పోలీస్ కమిషనర్ స్పందించి ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయించారు. అయితే నిర్ణీత చార్జీలు గిట్టుబాటు కాదని ఆటోలను ఆటోస్టాండ్‌లో నిలపకపోవడం సరికాదు. ఈవిషయంలో యూజర్స్ అసోసియేషన్ కూడా ఒకడుగు ముందుకు వేసి ఎవరికీ నష్టం వాటిల్లకుండా చార్జీలు వసూలు చేసేలా చొరవ తీసుకోవాలని సూచించాం. ఇదే విషయమైఆటో యూనియన్ నాయకులతో పలుమార్లు చర్చించాం. రెండు వైపుల నుంచి చొరవ తీసుకుంటే తప్పా సమస్య పరిష్కారం అయ్యేలా కనపడడం లేదు.

– కిల్లి వెంకటరావు, ట్రాఫిక్ సీఐ

సిమెంట్ పరిశ్రమను అడ్డుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పెదగంట్యాడ: మండలంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుందామని, ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం రద్దు చేసే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ నెల 8న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిద్దామని పలువురు పిలుపునిచ్చారు. ఈ మేరకు గాజువాక క్లబ్‌లో వార్వా నివాస్, వాయిస్ ఆఫ్ గాజువాక ఆధ్వర్యంలో శనివారం గాజువాకలో 35 సంఘాల ప్రతినిధులు, పరిసర ప్రాంతాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని, ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజలతో కలసి అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అదానీ గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యం కారణంగా ఇటు గాజువాక, అటు పెదగంట్యాడ ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. పెదగంట్యాడ పరిధిలోని 20 ఎకరాల స్థలంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ ఇప్పటికే పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు, ఐద్వా గాజువాక జోన్ నాయకురాలు ఎం.శ్రీదేవి, సీపీఐ కార్యదర్శి కె.సత్యనారాయణ, ఏపీ పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

అనుమతులు రద్దు చేయాలి

పెదగంట్యాడలో ఏర్పాటు చేయదలచిన సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ యూనియన్ నాయకుడు కురందాసు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. సీతానగరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ముసిరి శ్రీను, నమ్మి అప్పలనాయుడు, నమ్మి రమణ, చట్టి సింహాచలం, కుమార్, అన్నాజీ, రాంబాబు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

అగనంపూడి: జీవీఎంసీ 8వ వార్డు డొంకాడ, పినమడక, పూడివానిపాలెం సెక్టార్–1 కూడలిలో దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రుల ముగింపు సందర్భంగా శనివారం విశేష అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) పాల్గొని అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కోమటి శ్రీనివాసరావు, డాన్ శ్రీను, బంగార్రాజు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సాయంత్రం అనుపు మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు సత్కారం



ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: ఆర్ఈసీఎస్ అగనంపూడి సెక్షన్ కార్యాలయంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా చేరిన తమరాన శ్రీనివాసరావు, బదిలీపై వెళ్లిన అకౌంట్స్ ఆఫీసర్ భీశెట్టి కోటేశ్వరరావులను శనివారం అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఏడీఈ శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అగనంపూడి ఏఈ జె.లక్ష్మణరావు, ప్రజా సంఘాల నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ, దానబాల పైడికొండ, గంతకోరు అప్పారావు, తేజశ్వరి, కొలిపాక అప్పారావు, పెదిరెడ్ల నీలకంఠం, మొదలవలస గోవిందరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న నరసింహపాత్రుడు

పెదగంట్యాడ: ఐటీఐలో శిక్షణ పొందిన వారు ఉపాధి పొందాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. 2025 సంవత్సరంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (న్యూ ఐటీఐ)లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు మరింత నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని, పరిశ్రమల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ నూ ఐటీఐలో మూడు కొత్త ట్రేడులు (రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ (కెమికల్) ఎఫిలియేషన్) ట్రేడులు జోడించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ట్రేడ్లు ప్రారంభించడం ద్వారా విద్యార్థులకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇదేమి రోడ్డు మహాప్రభో



లంకెలపాలెం కూడలిలో రహదారి ఛిద్రమైంది. జాతీయ రహదారి నుంచి ఫార్మాసిటీ మలుపు తిరిగే ప్రాంతంలో, అలాగే నిత్యం రద్దీగా ఉండే దుకాణాలు (ఆటోస్టాండ్) ముందు రోడ్డు శిథిలం కావడంతో స్థానికులు, ప్రయాణికులు, ఫార్మా ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. రైల్వే క్రాసింగ్ వంతెనపై కూడా రోడ్డు ఎక్కడికక్కడ గోతులమయంగా మారింది. దీనికి తోడు వీధి దీపాలు వెలగని పరిస్థితి ఉండడంతో ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. పాలకులు,అధికారులు స్పందించి తక్షణమే గుంతలు పూడ్చడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–అగనంపూడి

ఎండాడలోనే భవన నిర్మాణం చేపట్టాలి

- జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అప్పలనారాయణ



మాట్లాడుతున్న అల్సి అప్పలనారాయణ

డాబాగార్డెన్స్: యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండాడలో కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్సి అప్పలనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు దాసు మోహనరావు, అల్లు రమణతో కలిసి మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంఘ భవనానికి జీవో జారీ చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి స్థలం మార్పునకు ప్రయత్నిస్తుందన్నారు. దీని వల్ల యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే కూటమి ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. యాదవులు అభివృద్ధి చెందాలంటే సంఘ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యాదవ సంఘం మహిళా నాయకురాలు అనుపమ, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు

మద్దిలపాలెం: విదేశీ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్, అంతర్జాతీయ వ్యవహారాల(ఇన్‌చార్జి) డీన్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఆకాంక్షించారు. ఏయూలో వివిధ దేశాల నుంచి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం ఇంజినీరింగ్ కళాశాల గౌతమబుద్ధ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సాంకేతిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో అడుగేయాలని విదేశీ విద్యార్థులకు సూచించారు. ఐసీసీఆర్ బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం అనేక దేశాలతో తమ స్నేహాన్ని కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను ఆయా దేశాల యువతకు అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఏయూవిద్యార్థులకు అవసరమైన సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తామన్నారు.కార్యక్రమంలో ఐసీసీఆర్ తరఫున కొత్తగా ప్రవేశం పొందిన సుమారు 300 మంది అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కార్మికులు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులోని జేపీ ఆఫ్‌షోర్‌లో పని చేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఎం. కుమార మంగళం మాట్లాడుతూ నెలకు రూ. 17,524 వేతనం అయితే రూ. 14,500 ఇస్తున్నారని, 12 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవులు ఇవ్వడం లేదని, వీక్లీ ఆఫ్ అమలు చేయడం లేదని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే కార్మికులను ఆపేయడం చట్ట వ్యతిరేకమన్నారు. జేపీ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్మికులను ఆపేసిందన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, ముఖ్యంగా పండగ ముందు రోజు కార్మికులను విధులకు హాజరు కాకుండా ఆపేసిందన్నారు. ఈ యాజమాన్యంపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి. జగన్, నాయకులు శ్రీను, తాతలు, అచ్యుత్, తరుణ్, కొర్లయ్య, ముత్రాజు తదితరులు పాల్గొన్నారు

9 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తగరపువలస: విశాఖ జిల్లా జాలారిపల్లిపాలెం గంగవరం కబడ్డీ గ్రౌండ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి జె.వి.ఎస్.ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అనుమతితో విశాఖ జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రబ్బర్ మ్యాట్లపై నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో విజయం సాధించే నాలుగు జట్లుకు జీవీఎంసీ 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఇతర దాతల సాయంతో జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి కింద రూ.15 వేలు ఇవ్వనున్నట్టు ప్రసాదరెడ్డి ప్రకటించారు.